11-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎంతగా మీరు తండ్రిని స్మృతి చేస్తారో, అంతగా మీ బుద్ధి తాళం తెరుచుకుంటుంది, ఎవరైతే ఘడియ-ఘడియ తండ్రి స్మృతిని మర్చిపోతారో, వారు దుర్భాగ్యశాలీ పిల్లలు"

ప్రశ్న:- ఖాతాను జమ చేసుకునేందుకు ఆధారము ఏమిటి? అన్నింటికన్నా గొప్ప సంపాదన ఎందులో ఉంది?

జవాబు:- దానం చేయడం ద్వారా ఖాతా జమ అవుతుంది. ఎంతగా మీరు ఇతరులకు తండ్రి పరిచయాన్ని ఇస్తారో, అంతగా సంపాదన వృద్ధి చెందుతూ ఉంటుంది. మురళి ద్వారా మీకు చాలా గొప్ప సంపాదన జరుగుతుంది. ఈ మురళి నల్లగా ఉన్నవారి నుండి తెల్లగా చేసేటువంటిది. మురళిలోనే ఖుదా యొక్క ఇంద్రజాలము ఉంది. మురళీ ద్వారానే మీరు సుసంపన్నులుగా అవుతారు.

పాట:- మేము ఆ మార్గములో నడవాలి... (హమే ఉన్ రాహూ పర్ చల్నా హై...)

ఓం శాంతి. ఆత్మిక తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, మీరు పడిపోతూ ఉంటారు కానీ సంభాళించుకుంటూ ఉండాలి. ఘడియ-ఘడియ తండ్రిని మర్చిపోతారు అనగా పడిపోతారు. స్మృతి చేస్తే సంభాళించుకున్నట్లు. మాయ తండ్రి స్మృతిని మరపింపజేస్తుంది ఎందుకంటే ఇది కొత్త విషయం కదా. ఆ మాటకొస్తే తండ్రిని ఎప్పుడూ ఎవ్వరూ మర్చిపోరు. స్త్రీ ఎప్పుడూ తన పతిని మర్చిపోదు. నిశ్చితార్థం జరిగిన వెంటనే బుద్ధియోగము జోడింపబడుతుంది. మర్చిపోయే విషయమేమీ ఉండదు. పతి, పతియే. తండ్రి, తండ్రియే. ఇప్పుడు వీరైతే నిరాకార తండ్రి, వీరిని ప్రియుడు అని కూడా అంటారు. భక్తులను ప్రేయసులు అని అంటారు. ఈ సమయంలో అందరూ భక్తులే. భగవంతుడు ఒక్కరే. భక్తులను ప్రేయసులని, భగవంతుడిని ప్రియుడని అంటారు లేక భక్తులను పిల్లలని, భగవంతుడిని తండ్రి అని అంటారు. ఇప్పుడు పతులకే పతి లేక తండ్రులకే తండ్రి ఆ ఒక్కరే. ప్రతి ఆత్మకు తండ్రి ఆ పరమాత్మయే. ఆ లౌకిక తండ్రి ప్రతి ఒక్కరికీ వేరు-వేరుగా ఉంటారు. ఈ పారలౌకిక పరమపిత, ఆత్మలందరికీ తండ్రి ఒక్క గాడ్ ఫాదర్ మాత్రమే, వారి పేరు శివబాబా. కేవలం గాడ్ ఫాదర్, మౌంట్ ఆబూ అని వ్రాస్తే ఉత్తరం చేరుకుంటుందా చెప్పండి? పేరు కూడా వ్రాయల్సి ఉంటుంది కదా. వీరు అనంతమైన తండ్రి, వీరి పేరు శివ. శివకాశీ అని అంటారు కదా. అక్కడ శివుని మందిరము ఉంది, తప్పకుండా అక్కడికి కూడా వెళ్ళి ఉంటారు. రాముడు ఇక్కడికి వెళ్ళారు, అక్కడికి వెళ్ళారు అని, గాంధీ ఇక్కడికి వెళ్ళారు అని చూపిస్తారు కదా... కావున తప్పకుండా శివబాబాకు కూడా చిత్రము ఉంది. కానీ వారు నిరాకారుడు. వారిని తండ్రి అని అంటారు, ఇతరులెవ్వరినీ సర్వులకు తండ్రి అని అనలేరు. బ్రహ్మ, విష్ణు, శంకరులకు కూడా వారే తండ్రి. వారి పేరు శివ. కాశీలో కూడా మందిరం ఉంది, ఉజ్జయినిలో కూడా శివుని మందిరము ఉంది. ఇన్ని మందిరాలు ఎందుకు తయారయ్యాయి అనేది ఎవ్వరికీ తెలియదు. ఏ విధంగా లక్ష్మీ-నారాయణులను పూజిస్తారు, వీరు స్వర్గానికి యజమానులుగా ఉండేవారు అని అంటారు, కానీ స్వర్గము ఎప్పుడు ఉండేది, వారు యజమానులుగా ఎలా అయ్యారు, ఇది ఎవ్వరికీ తెలియదు. పూజారులు ఎవరికైతే పూజ చేస్తారో వారి ఆక్యుపేషన్ (కర్తవ్యం) గురించే తెలియకపోతే మరి దానిని అంధశ్రద్ధ అనే అనడం జరుగుతుంది కదా. ఇక్కడ కూడా బాబా అని అంటారు, కానీ పూర్తి పరిచయం లేదు. ఈ తల్లి-తండ్రి గురించి తెలియదు. లక్ష్మి-నారాయణుల పూజారులు పూజ చేస్తారు, శివుని మందిరములోకి వెళ్ళి మహిమ చేస్తారు, నీవే తల్లివి-తండ్రివి... అని పాడుతారు, కానీ వారు తల్లి-తండ్రి ఎలా అయ్యారు, ఎప్పుడు అయ్యారు - ఏమీ తెలియదు. భారతవాసులకే అసలేమీ తెలియదు. క్రిస్టియన్లు, బౌద్ధులు మొదలైనవారు తమ క్రైస్టును, బుద్ధుడిని తలుచుకుంటారు. క్రైస్టు ఫలానా సమయంలో క్రిస్టియన్ ధర్మాన్ని స్థాపన చేయడానికి వచ్చారని - వారి చరిత్ర గురించి వెంటనే తెలియజేస్తారు. భారతవాసులు ఎవరిని పూజించినా, వారు ఎవరు అనేది తెలియదు. శివుని గురించి గాని, బ్రహ్మ-విష్ణు-శంకరుల గురించి గాని, అలాగే జగదాంబ, జగత్పిత, లక్ష్మి-నారాయణుల గురించి గాని తెలియదు, కేవలం పూజలు చేస్తూ ఉంటారు. వారి జీవిత చరిత్ర ఏమిటి అనేది ఏమీ తెలియదు. తండ్రి కూర్చొని ఆత్మలకు అర్థం చేయిస్తారు - మీరు స్వర్గములో ఉన్నప్పుడు మీ ఆత్మ మరియు శరీరము, రెండూ పవిత్రముగా ఉండేవి, మీరు రాజ్యం చేసేవారు. మీకు తెలుసు, తప్పకుండా మేము రాజ్యం చేసేవారము, మేము పునర్జన్మలు తీసుకున్నాము, 84 జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ రాజ్యాధికారాన్ని పోగొట్టుకున్నాము, తెల్లగా ఉన్నవారి నుండి నల్లగా అయిపోయాము, సుందరముగా ఉండేవారము, ఇప్పుడు నల్లగా అయిపోయాము. ఈ రోజుల్లో నారాయణుడిని కూడా నల్లగా చూపిస్తారు, కావున వారే శ్రీకృష్ణునిగా, శ్రీ నారాయణునిగా ఉండేవారని నిరూపించబడుతుంది. కానీ ఈ విషయాల గురించి ఏ

మాత్రమూ అర్థం చేసుకోరు.

యాదవులు మిసైల్స్ ను కనుగొనేవారు మరియు కౌరవులు-పాండవులు సోదరులుగా ఉండేవారు. వారు అసురీ సోదరులుగా మరియు వీరు దైవీ సోదరులుగా ఉండేవారు. వీరు కూడా అసురీగానే ఉండేవారు కానీ వీరిని తండ్రి ఉన్నతంగా తయారుచేసి దైవీ సోదరులుగా తయారుచేసారు. ఇరువురి సోదరుల విషయంలో ఏమి జరిగింది? తప్పకుండా పాండవులు విజయాన్ని పొందారు, కౌరవులు వినాశనమయ్యారు. కొందరు ఇక్కడే కూర్చుని ఉన్నా, మమ్మా-బాబా అని అంటారు కానీ వారి గురించి ఏమీ తెలియదు, తండ్రి శ్రీమతముపై నడవరు, వారికి బాబా మాకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారని తెలియదు, నిశ్చయము ఉండదు. దేహాభిమానులుగా ఉన్న కారణంగా దేహపు మిత్ర-సంబంధీకులు మొదలైనవారిని తలచుకుంటూ ఉంటారు. ఇక్కడైతే దేహీ అయిన తండ్రిని స్మృతి చేయాలి. ఇది కొత్త విషయము. ఇది మనుష్యులెవ్వరూ అర్థం చేయించలేరు. ఇక్కడ తల్లి-తండ్రి వద్ద కూర్చొని ఉన్నా కూడా వారి గురించి తెలియదు. ఇది ఆశ్చర్యం కదా. వారి జన్మయే ఇక్కడ జరిగింది, అయినా కానీ వారి గురించి తెలియదు ఎందుకంటే వారు నిరాకారుడు. వారిని మంచి రీతిలో అర్థం చేసుకోలేకపోతారు. వారి మతముపై నడవకపోతే ఆశ్చర్యము కలిగేలా పారిపోతారు. ఎవరి నుండైతే స్వర్గపు 21 జన్మల వారసత్వము లభిస్తుందో, వారిని తెలుసుకోకపోవడం వలన పారిపోతారు. ఎవరైతే తండ్రిని తెలుసుకుంటారో వారిని సౌభాగ్యశాలురని అంటారు. దుఃఖము నుండి విడిపించేవారైతే ఒక్క తండ్రి మాత్రమే. ప్రపంచంలో దుఃఖమైతే ఎంతో ఉంది కదా. ఇది ఉన్నదే భ్రష్టాచారీ రాజ్యము. డ్రామానుసారంగా మళ్ళీ 5000 సంవత్సరాల తర్వాత ఇటువంటి భ్రష్టాచారీ సృష్టియే ఉంటుంది, మళ్ళీ తండ్రి వచ్చి సత్యయుగీ శ్రేష్ఠాచారీ స్వరాజ్యాన్ని స్థాపన చేస్తారు. మీరు మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు వచ్చారు. ఇది మనుష్యుల ప్రపంచము. దేవతల ప్రపంచము సత్యయుగములో ఉంటుంది. ఇక్కడ పతిత మనుష్యులు ఉన్నారు, పావన దేవతలు సత్యయుగములో ఉంటారు. మీరెవరైతే బ్రాహ్మణులుగా అయ్యారో వారికే ఈ విషయాలు అర్థం చేయించడం జరుగుతుంది. ఎవరైతే బ్రాహ్మణులుగా అవుతూ ఉంటారో వారికి అర్థం చేయిస్తూ ఉంటారు. అందరూ అయితే బ్రాహ్మణులుగా అవ్వరు. ఎవరైతే బ్రాహ్మణులుగా అవుతారో వారే మళ్ళీ దేవతలుగా అవుతారు. బ్రాహ్మణులుగా అవ్వకపోతే దేవతలుగా అవ్వలేరు. మమ్మా-బాబా అని అన్నారంటే బ్రాహ్మణ కులములోకి వచ్చినట్లు. ఇక మిగిలినదంతా చదువు యొక్క పురుషార్థముపై ఆధారపడి ఉంటుంది. ఇక్కడ రాజ్యస్థాపన జరుగుతోంది, ఇబ్రహీం, బుద్ధుడు మొదలైనవారెవ్వరూ రాజ్యస్థాపన చేయరు. క్రైస్టు ఒంటరిగా వచ్చారు, ఎవరిలోనో ప్రవేశించి క్రిస్టియన్ ధర్మాన్ని స్థాపన చేసారు, ఆ తర్వాత క్రిస్టియన్ ధర్మానికి సంబంధించిన ఆత్మలెవరైతే పైన ఉన్నారో, వారు వస్తూ ఉంటారు. ఇప్పుడు క్రిస్టియన్ ధర్మానికి సంబంధించిన ఆత్మలందరూ ఇక్కడే ఉన్నారు. ఇప్పుడు అంతిమంలో అందరూ తిరిగి వెళ్ళాలి. తండ్రి అందరికీ మార్గదర్శకునిగా అయి అందరినీ దుఃఖాల నుండి విముక్తులుగా చేస్తారు. తండ్రియే మొత్తం మానవాళికి ముక్తిప్రదాత మరియు మార్గదర్శకుడు. వారు ఆత్మలందరినీ తిరిగి తీసుకువెళ్తారు. ఆత్మ పతితముగా ఉన్న కారణముగా తిరిగి వెళ్ళలేదు. నిరాకారీ ప్రపంచమైతే పావనమైనది కదా. ఇప్పుడు ఈ సాకార సృష్టి పతితముగా ఉంది. ఇప్పుడు వీరందరూ నిరాకారీ ప్రపంచములోకి వెళ్ళాలంటే వీరిని పావనంగా ఎవరు తయారుచేస్తారు? కావుననే ఓ గాడ్ ఫాదర్, రండి అని పిలుస్తారు. గాడ్ ఫాదర్ వచ్చి తెలియజేస్తారు, నేను ఒక్కసారే వస్తాను, మొత్తం ప్రపంచమంతా భ్రష్టాచారిగా అయినప్పుడు వస్తాను. ఒకరినొకరు హతమార్చుకునేందుకు ఎన్ని బుల్లెట్లు, బాంబులు మొదలైనవి తయారుచేస్తూ ఉంటారు. ఒకటేమో బాంబులను తయారుచేస్తున్నారు, ఇంకొకటి ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు మొదలైనవి జరుగుతాయి, పిడుగులు పడతాయి, రోగగ్రస్తులుగా అవుతారు ఎందుకంటే ఎరువు అయితే తయారవ్వాలి కదా. అశుద్ధమైనవాటి నుండే ఎరువు తయారవుతుంది కదా. మరి ఈ సృష్టి అంతటికీ ఎరువు కావాలి, తద్వారా ఫస్ట్ క్లాస్ ఉత్పత్తి జరుగుతుంది. సత్యయుగములో కేవలం భారత్ యే ఉండేది. ఇప్పుడు ఇంతమంది వినాశనం జరగాలి. తండ్రి అంటారు - నేను వచ్చి దైవీ రాజధానిని స్థాపన చేస్తాను, మిగిలినవారంతా అంతమైపోతారు, మీరు మాత్రము స్వర్గములోకి వెళ్తారు. స్వర్గాన్ని అయితే అందరూ తలచుకుంటారు కదా. కానీ స్వర్గము అని దేనినంటారో ఎవ్వరికీ తెలియదు. ఎవరైనా మరణిస్తే స్వర్గవాసులయ్యారు అని అంటారు. అరే, ఎవరైతే కలియుగములో మరణిస్తారో వారు తప్పకుండా పునర్జన్మ కలియుగములోనే తీసుకుంటారు కదా. ఈ మాత్రం తెలివి కూడా ఎవ్వరిలోనూ లేదు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ మొదలైన పేర్లు పెట్టుకుంటారు కానీ ఏమీ అర్థం చేసుకోరు. మనుష్యులు మందిరాలలో ఉండేవారు. అది క్షీరసాగరము, ఇది విషయసాగరము. ఈ విషయాలన్నింటినీ తండ్రియే అర్థం చేయిస్తారు. మనుష్యులనే చదివిస్తారు, అంతేకానీ జంతువులను చదివించరు.

ఈ డ్రామా తయారై ఉందని తండ్రి అర్థం చేయిస్తారు. షావుకారు వ్యక్తుల వద్ద అటువంటి ఫర్నీచర్ కూడా ఉంటుంది.

పేదవారి వద్ద గవ్వలే ఉంటాయి, షావుకారుల వద్దనైతే ఎన్నో వైభవాలు ఉంటాయి. మీరు సత్యయుగములో షావుకారులుగా అయినప్పుడు మీకు వజ్ర-వైఢూర్యాలతో పొదిగి ఉన్న మహళ్ళు ఉంటాయి. అక్కడ ఎలాంటి మురికి ఉండదు, దుర్గంధము ఉండదు. ఇక్కడైతే దుర్గంధము ఉంటుంది, కావుననే అగరబత్తులు మొదలైనవి వెలిగించడం జరుగుతుంది. అక్కడైతే పుష్పాలు మొదలైనవాటిలో సహజ సుగంధము ఉంటుంది. అగరబత్తులు వెలిగించాల్సిన అవసరముండదు, దానిని స్వర్గము అని అంటారు. తండ్రి స్వర్గానికి యజమానులుగా తయారుచేయడానికి చదివిస్తారు. చూడండి, ఎంత సాధారణంగా ఉన్నారు. ఇటువంటి తండ్రిని స్మృతి చేయడం కూడా మర్చిపోతారు! నిశ్చయం పూర్తిగా లేకపోతే మర్చిపోతారు. ఎవరి నుండైతే స్వర్గ వారసత్వం లభిస్తుందో, అటువంటి తల్లి-తండ్రిని మర్చిపోవడమంటే అది ఎంతటి దురదృష్టము. తండ్రి వచ్చి ఉన్నతోన్నతులుగా తయారుచేస్తారు. ఇటువంటి తల్లి-తండ్రి మతముపై నడవకపోతే 100 శాతము అతి దురదృష్టవంతులని అంటారు. నంబరువారుగా అయితే ఉంటారు కదా. చదువు ద్వారా విశ్వాధిపతులుగా అవ్వడం ఎక్కడ, దాస-దాసీలుగా అవ్వడం ఎక్కడ! మీరు ఎంతవరకూ చదువుకుంటున్నారు అనేది మీరు అర్థం చేసుకోగలరు. అక్కడ ధర్మపితలు కేవలం ధర్మ స్థాపన చేసేందుకే వస్తారు, ఇక్కడ తల్లి-తండ్రి ఉన్నారు ఎందుకంటే ఇది ప్రవృత్తి మార్గము కదా. పవిత్రమైన ప్రవృత్తి మార్గము ఉండేది. ఇప్పుడు ఉన్నది అపవిత్రమైన ప్రవృత్తి మార్గము. లక్ష్మీ-నారాయణులు పవిత్రముగా ఉండేవారు కావున వారి సంతానం కూడా పవిత్రముగానే ఉండేది. మేము ఏమవుతాము అనేది మీకు తెలుసు. తల్లి-తండ్రి ఎంతో ఉన్నతముగా తయారుచేస్తారు కావున వారిని ఫాలో చేయాలి కదా! భారత్ నే మదర్ ఫాదర్ కంట్రీ అని అంటారు. సత్యయుగములో అందరూ పవిత్రులుగా ఉండేవారు, ఇక్కడ పతితులుగా ఉన్నారు. ఎంత మంచి రీతిలో అర్థం చేయించడం జరుగుతుంది, అయినా కానీ తండ్రిని స్మృతి చేయకపోతే బుద్ధి తాళం మూసుకుపోతుంది. వింటూ-వింటూ చదువును వదిలేసినట్లయితే తాళం పూర్తిగా మూసుకుపోతుంది. స్కూల్లో కూడా నంబరువారుగా ఉంటారు. రాతిబుద్ధి కలవారు మరియు పారసబుద్ధి కలవారు అని అనడం జరుగుతుంది. రాతిబుద్ధి కలవారు ఏమీ అర్థం చేసుకోరు, రోజంతటిలో 5 నిమిషాలు కూడా తండ్రిని స్మృతి చేయరు. 5 నిమిషాలే స్మృతి చేస్తే తాళం కూడా అంతే తెరుచుకుంటుంది. ఎక్కువ స్మృతి చేస్తే తాళం బాగా తెరుచుకుంటుంది. మొత్తం ఆధారమంతా స్మృతిపైనే ఉంది. కొందరు పిల్లలు తండ్రికి ఉత్తరము వ్రాస్తారు - ప్రియమైన బాబా లేక ప్రియమైన దాదా అని వ్రాస్తారు. ఇప్పుడు కేవలం ప్రియమైన దాదా అని వ్రాసి పోస్టులో ఉత్తరం వేస్తే అది చేరుకుంటుందా? పేరైతే ఉండాలి కదా! దాదా, దాదీలైతే ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారు కదా. అచ్ఛా!

ఈ రోజు దీపావళి. దీపావళి నాడు కొత్త ఖాతాను పెడతారు. మీరు సత్యాతి-సత్యమైన బ్రాహ్మణులు. ఆ బ్రాహ్మణులు వ్యాపారుల చేత కొత్త ఖాతాను పెట్టిస్తారు. అలాగే మీరు కూడా కొత్త ఖాతాను పెట్టుకోవాలి. కానీ ఇది కొత్త ప్రపంచం కొరకు. భక్తి మార్గపు ఖాతా అనంతమైన నష్టంతో కూడినది. మీరు అనంతమైన వారసత్వాన్ని పొందుతారు, అనంతమైన సుఖ-శాంతులను పొందుతారు. ఈ అనంతమైన విషయాలను అనంతమైన తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు మరియు అనంతమైన సుఖాన్ని పొందే పిల్లలు మాత్రమే ఈ విషయాలన్నింటినీ అర్థం చేసుకోగలరు. తండ్రి వద్దకు కోట్లల్లో ఏ ఒక్కరో వస్తారు. నడుస్తూ-నడుస్తూ సంపాదనలో నష్టం కలిగితే అప్పటివరకు ఏదైతే జమ చేసుకున్నారో అది కూడా లేకుండా పోతుంది. ఎప్పుడైతే ఇతరులకు దానం ఇస్తారో అప్పుడే మీ ఖాతా వృద్ధి చెందుతుంది. దానం ఇవ్వకపోతే సంపాదన వృద్ధి చెందదు. సంపాదన వృద్ధి చెందాలని మీరు పురుషార్థము చేస్తారు. ఎప్పుడైతే ఎవరికైనా దానం చేస్తారో, లాభాన్ని చేకూరుస్తారో, అప్పుడే సంపాదన వృద్ధి చెందుతుంది. ఎవరికైనా తండ్రి పరిచయాన్ని ఇచ్చారంటే జమ అవుతుంది. పరిచయం ఇవ్వకపోతే జమ కూడా అవ్వదు. మీ సంపాదన చాలా-చాలా గొప్పది. మురళి ద్వారా మీ సత్యమైన సంపాదన జరుగుతుంది. కేవలం - ఈ మురళి ఎవరిది అన్నది తెలియాలి. ఎవరైతే నల్లగా అయిపోయారో వారే మళ్ళీ తెల్లగా తయారయ్యేందుకు మురళిని వినాలి - ఈ విషయం కూడా పిల్లలైన మీకే తెలుసు. నీ మురళిలో ఇంద్రజాలముంది అని అంటారు. ఖుదా యొక్క ఇంద్రజాలమని అంటారు కదా. కావున ఈ మురళిలో ఖుదా యొక్క ఇంద్రజాలము ఉంది. ఈ జ్ఞానం కూడా మీకు ఇప్పుడే ఉంది, దేవతలలో ఈ జ్ఞానం లేదు. వారిలోనే జ్ఞానం లేనప్పుడు మరి తర్వాత వచ్చేవారిలో జ్ఞానం ఎలా ఉండగలదు? శాస్త్రాలు మొదలైనవి ఏవైతే తర్వాత తయారవుతాయో అవన్నీ అంతమైపోతాయి. మీ ఈ సత్యమైన గీతలు అయితే చాలా తక్కువ ఉన్నాయి. ప్రపంచంలో ఆ గీతలు లక్షల సంఖ్యలో ఉంటాయి. వాస్తవానికి ఈ చిత్రాలే సత్యమైన గీత. ఈ చిత్రాల ద్వారా ఎంతగానైతే అర్థం చేసుకోగలరో అంతగా ఆ గీత ద్వారా అర్థం చేసుకోలేరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మంచి రీతిలో చదువు చదువుకొని స్వయాన్ని సౌభాగ్యశాలురుగా (అదృష్టవంతులుగా) తయారుచేసుకోవాలి. దేవతలుగా అయ్యేందుకు పక్కా బ్రాహ్మణులుగా అవ్వాలి.

2. దేహీ అయిన తండ్రిని స్మృతి చేయడానికి దేహీ-అభిమానులుగా అవ్వాలి. దేహాన్ని కూడా మర్చిపోయే అభ్యాసాన్ని చేయాలి.

వరదానము:- సదా స్వయాన్ని సారథిగా మరియు సాక్షీగా భావిస్తూ దేహ-భానము నుండి అతీతముగా ఉండే యోగయుక్త భవ

యోగయుక్తముగా ఉండేందుకు సరళమైన విధి - సదా స్వయాన్ని సారథిగా మరియు సాక్షీగా భావిస్తూ నడుచుకోవడము. ఈ రథాన్ని నడిపించే ఆత్మనైన నేను సారథిని, ఈ స్మృతి స్వతహాగానే ఈ రథము నుండి లేక దేహము నుండి లేక ఏ విధమైన దేహభానము నుండైనా అతీతముగా చేస్తుంది. దేహభానము లేకపోతే సహజముగానే యోగయుక్తులుగా అవుతారు మరియు ప్రతి కర్మ కూడా యుక్తియుక్తముగా జరుగుతుంది. స్వయాన్ని సారథిగా భావించినట్లయితే సర్వ కర్మేంద్రియాలు తమ కంట్రోల్ లో ఉంటాయి. వారు ఏ కర్మేంద్రియానికి వశమవ్వలేరు.

స్లోగన్:- విజయీ ఆత్మలుగా అవ్వాలంటే అటెన్షన్ మరియు అభ్యాసము - వీటిని నిజ సంస్కారాలుగా చేసుకోండి.